క్లుప్తంగా

నేడు పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేత

మాచర్ల: నియోజకవర్గ పరిధిలోని మాచర్ల విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయ పరిధిలో మాచర్ల పట్టణం, రూరల్, దుర్గి, వెల్దుర్తి మండలాలలో శనివారం ఉదయం విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని వినియోగదారులు గమనించాలని విద్యుత్ సబ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.హరిబాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఓఎస్‌డీ ఎ.రామయ్యలు శుక్రవారం తెలిపారు. వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రెండవ శనివారం సబ్ స్టేషన్ ఫీడర్స్ మరమ్మతుల నిమిత్తం శనివారం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

గురజాల : మండల వ్యాప్తంగా శనివారం విద్యుత్ కోత నిర్వహించడం జరుగుతుందని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మస్తాన్ వలి తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సబ్ స్టేషన్ నందు ఫీడర్స్ మరియు మరమ్మతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలన్నారు.

దాచేపల్లి : మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్‌శాఖ ఏఈలు నాయక్, నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. నడికుడి, పెదగార్లపాడు, మాదినపాడు గ్రామాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్లు, విద్యుత్ తీగల మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు, వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని వారు కోరారు.

పిడుగురాళ్ల: పట్టణ పరిధిలోని కొండమోడు, మహావీర్ నగర్, ఎస్ఎస్, న్యూ ఎస్ఎస్ బైపాస్, జానపాడు సబ్ స్టేషన్‌లు మరమ్మతుల దృష్ట్యా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏడీఏ బాజీ నాయక్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంతని తెలియజేశారు. అంతరాయాన్ని వినియోగదారులు గుర్తించి సహకరించాలని తెలియజేశారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



పిడుగురాళ్ల: పట్టణంలోని 12వ వార్డులో కుంచపు హనుమంతరావు అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను కౌన్సిలర్ కాంట్రగుంట శ్రీనివాసరావు పరామర్శించారు. అనంతరం మట్టిఖర్చుల నిమిత్తం రూ.10 వేలు వైఎస్సార్ బీమా నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో తురకా నాగేశ్వరరావు, తురకా వెంకటేశ్వర్లు, దేవ్వళ్ల గోపి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పేకాట స్థావరంపై దాడులు

ఏడుగురు అరెస్టు, కేసు నమోదు



దుర్గి: అసాంఘిక చర్యలకు పాల్పడుతున్న వ్యక్తుల కదలికలపై నిఘా ఏర్పాటు చేసి మండల పరిధిలో పలు గ్రామాలలో విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ శివ శుక్రవారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు నిదానంపాడు పరిసర ప్రాంతాలలో దాడులు నిర్వహించగా ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.32,060 నగదు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నాటుసారా తయారీ దారులను గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించారు. నాటుసారా, తెలంగాణ మద్యం కలిగి ఉండటం, క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడిన వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ప్రస్తుతం క్రికెట్ బెట్టింగ్‌లలో పాల్గొంటున్న యువకులు, వ్యక్తుల పట్ల ప్రత్యేక నిఘా ఉంచినట్లు వివరించారు.

ముందస్తు దసరా వేడుకలు



మాచర్ల: పట్టణంలోని పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించటంతో శుక్రవారం ఆయా పాఠశాలల్లో ముందస్తు దసరా ఉత్సవాలు నిర్వహించారు. అందులో భాగంగా పట్టణంలోని 10వ వార్డులో కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ హనుమంతరావు, ఏట శ్రీధర్, డైరెక్టర్ ఎం.రామకృష్ణ, డాక్టర్ శివ ఆధ్వర్యంలో ముందస్తు వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. పట్టణంలోని నారాయణ స్కూల్‌లో ప్రిన్సిపాల్ ఉల్లారెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు దసరా ఉత్సవాలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సొసైటీ కాలనీలోని కిడ్స్ పాఠశాలలో ప్రిన్సిపాల్ రామకృష్ణ శాస్త్రి ఆధ్వర్యంలో దసరా ముందస్తు ఉత్సవాలు జరిపారు. ఈ సందర్భంగా పలువురు దసరా పండుగ తెలుగు సంస్కృతి, ఆయుధపూజ అమ్మవారి అలంకరణలు, దసరా వేడుకల గురించి మాట్లాడారు.

సంతృప్తితో ఉప్పొంగుతున్న పేద గుండెలు



మిరియాల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విచ్చేసిన ప్రజలు

కారెంపూడి: మండలంలోని మిరియాల గ్రామంలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరానికి అనారోగ్య సమస్యలున్న పేద ప్రజలు పోటెత్తారు. మధ్యాహ్నం మూడు గంటలకే 578 మంది హాజరై తమ అనారోగ్య సమస్యలను డాక్టర్లకు చూపించుకుని ఉచితంగా మందులు పొందారు. ఒక్కొక్కరిది ఒక్కో సమస్య పొలం వెళ్లి గాయాలై కొందరు, అలాగే కాళ్లవాపులు, తలనొప్పులతో మరికొందరు ఇలా ఎంతో మంది ఆరోగ్య శిబిరంలో సేవలు పొంది సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్ ఆర్ ఆంజనేయులు నాయక్, డాక్టర్ బి.దుర్గ, డాక్టర్ ఎం.రమ్య, స్త్రీ ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ కె.శ్రావణి, ఎండీ జనరల్ డాక్టర్ డి.నాగేంద్ర బాబు శిబిరంలో వైద్య సేవలందించారు. ఆప్తమాలజీ డాక్టర్ జి.శ్రీధర్ కంటి సమస్యలున్న వారికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఆయుష్ డాక్టర్ కె.ఉదయలక్ష్మి ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. ఇలా గ్రామ సచివాలయం, పంచాయతీ ఉద్యోగులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, 104, 108 సిబ్బంది, ఆశా కార్యకర్తలు అంగన్‌వాడీ టీచర్లు అందరూ కూడా ఎవరికి కేటాయించిన పనులను వారు శ్రద్ధగా నిర్వహించారు. శిబిరం ప్రారంభ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బత్తుల ఏడుకొండలు, ఎంపీటీసీ కొమ్మెరెడ్డి ఎర్రగురవారెడ్డి, ఉప సర్పంచ్ దారెడ్డి ప్రభాకరరెడ్డి, ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, కారెంపూడి పట్టణ పార్టీ అధ్యక్షుడు బొమ్మిన అల్లయ్య, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అల్లు వెంకటేశ్వరరెడ్డి, తహసీల్దార్ జి.శ్రీనివాసయాదవ్, ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లెలు, పట్టణాల్లో 'సురక్ష' వైద్య శిబిరాలు

గురజాల : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తుందని గ్రామ సర్పంచ్ సింగం నాగరాజు అన్నారు. మండల పరిధిలోని గొట్టిముక్కల గ్రామంలో సురక్ష శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష శిబిరం నిరుపేదలకు వరంలాంటిదన్నారు. వైద్య రంగంలో పలు సంస్కరణలు తీసుకువచ్చి గ్రామీణ స్థాయిలో కూడా ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో నందు ఇద్దరు సూపర్ స్పెషాలిటీ వైద్యులు సేవలు అందిస్తున్నారన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకునే విధంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఎంతో మేలు

రెంటచింతల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్షతో రాష్ట్ర ప్రజలందరికి ఎంతో మేలు జరుగుతుందని డీడీవో, మండల ప్రత్యేక అధికారి యార్ల మహాలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో ఇన్‌చార్జి సర్పంచ్ గొట్టం వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, అధికారులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రజలను సంపూర్ణమైన ఆరోగ్య వంతులుగా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. జేసీఎస్ మండల కన్వీనర్ పమ్మిసీతారామిరెడ్డి, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, ఈఓపీఆర్డీ అనంత కోటేశ్వరరావు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వృద్ధునికి బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది



గొట్టిముక్కల గ్రామంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడమే సీఎం జగన్ లక్ష్యం

ప్రభుత్వ విప్ పీఆర్కే

రెంటచింతల: వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషిచేసిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం రాత్రి మండల కేంద్రమైన రెంటచింతల గ్రామ సర్పంచ్‌గా పేర్ల చౌడమ్మ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సీఎం జగన్ స్ఫూర్తితో ప్రతి సామాజిక వర్గానికి న్యాయం చేయడంలో భాగంగా చౌడమ్మకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. నూతన సర్పంచ్ చౌడమ్మతో కలిసి గ్రామంలోని నాయకులు, కార్యకర్తలు, అధికారులు అందరూ గ్రామాభివృద్ధికి తోడ్పడాలన్నారు. అందరం కలిసి సమష్టిగా పార్టీ బలోపేతానికి కృషిచేసి రానున్న 2024 సార్వత్రిక ఎన్నికలలో మరోసారి సీఎం జగన్‌ను ముఖ్యమంత్రిని చేయడానికి పనిచేయాలన్నారు. జగనన్న ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఈ విషయం ఇప్పటికే ప్రజలలో అవగాహన ఉందన్నారు. ముందుగా ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి, మూడు జిల్లాల పార్టీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంటకరామిరెడ్డిలను గ్రామ పురవీధులలో గుర్రాలపై ఊరేగిస్తూ మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పూజల పుష్పావతిరామయ్య, జెడ్పీ వైస్ చైర్మన్ శౌంటిరెడ్డి నర్సిరెడ్డి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, జిల్లా కార్యదర్శి పల్లెర్ల సత్య వెంకటరామిరెడ్డి, జేసీఎస్ పల్నాడు జిల్లా కో ఆర్డినేటర్ మోర్త ఉమ, జిల్లా మండల పార్టీ అధ్యక్షుడు గొట్టం బ్రహ్మారెడ్డి, మాజీ సర్పంచ్‌లు అల్లం మల్రెడ్డి, అల్లం ప్రతాప్‌రెడ్డి, దుర్గి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి, డైరెక్టర్ వెన్నా వెంకటేశ్వరెడ్డి, పార్టీ నాయకులు శ్యామల రవికిషోర్‌రెడ్డి, పల్లెర్ల కోటిరెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు పూజల రామయ్య, పల్లెర్ల లక్ష్మారెడ్డి, బొద్దూరి బ్రహ్మారెడ్డి, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



రెంటచింతలలో పీఆర్కే, పీవీఆర్‌లను గుర్రాలపై ఊరేగిస్తున్న గ్రామస్తులు



రెంటచింతల సర్పంచ్‌గా పీఆర్కే సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న పేర్ల చౌడమ్మ

నేడు పల్నాడు మోటార్స్ అసోసియేషన్ సమావేశం

మాచర్ల: పట్టణంలోని గుంటూరుకు వెళ్లే రహదారి రైల్వేగేటు పక్కన జెడ్పీహెచ్ఎస్ బాలికోన్నత పాఠశాల ప్రాంతంలో పల్నాడు మోటార్స్ అసోసియేషన్ సమావేశాన్ని అసోసియేషన్ సీనియర్ నాయకుడు ట్రాక్టర్ కరిముల్లా ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ సభ్యులు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని శ్రీశైలం రోడ్డులో ఆటోనగర్ నిర్మాణంతో పాటు అసోసియేషన్ సభ్యుల సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. అనంతరం ట్రాక్టర్ కరిముల్లా ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అసోసియేషన్ సభ్యులంతా తప్పనిసరిగా హాజరై జయప్రదం చేయాలని కోరారు.

క్రికెట్ బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు

కారెంపూడి: క్రికెట్ ఆన్‌లైన్ బెట్టింగులకు పాల్పడుతున్న వారికి కారెంపూడి సీఐ దార్ల జయకుమార్, ఎస్ఐ ఎం.రామాంజనేయులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని సమాచారం అందుతోందన్నారు. క్రికెట్ బెట్టింగులకు పాల్పడే వారికి డబ్బు పోవడమే కాని రావడం అంటూ ఉండదని అదంతా ఓ మాయాజాలమని యువకులు అర్థం చేసుకోవాలని హితవు పలికారు. క్రికెట్ జరుగుతున్న సమయంలో యువకులు సెల్‌ఫోన్‌లలో బెట్టింగులకు పాల్పడుతున్నట్లు వివిధ స్టాల్స్ నుంచి పోలీసులకు సమాచారం ఉందన్నారు. ఎంతో కష్టపడి సంపాదించుకున్న డబ్బును బెట్టింగులలో ఒక్క రోజులో పోగొట్టుకుంటున్నారని తల్లిదండ్రులు తమ పిల్లల వ్యవహార శైలి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వారి బ్యాంకు ఖాతాలలో భారీగా నగదు ఉంచొద్దన్నారు. క్రికెట్ బెట్టింగులలో సర్వం పోగొట్టుకున్న ఘటనలు కళ్లముందు కన్పిస్తున్నారని అవి చూసి అయినా ఈ వ్యసనం నుంచి బయట పడాలని హితవు పలికారు. ఈ నేపథ్యంలో అన్ని ప్రాంతాలలో పోలీస్ నిఘా పెట్టామని పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ జయకుమార్ హెచ్చరించారు. బెట్టింగులకు పాల్పడే వారి సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

చేతుల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం



చేతులను ఎలా శుభ్రం చేసుకోవాలో విద్యార్థులకు వివరిస్తున్న ఉపాధ్యాయులు

కారెంపూడి: స్థానిక ఇందిరా నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని స్వచ్ఛ భారత్ మండల కో ఆర్డినేటర్ కె.సుబ్బారావు నిర్వహించారు. ఈ నెల15న ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా తరగతి గదిలో మూడవ తరగతి పాఠ్యాంశంగా ఉన్న చేతుల పరిశుభ్రతపై ఈఓపీఆర్డీ పి.సత్యప్రసాద్, కె.సుబ్బారావు అవగాహన కల్పించారు. ఆ పాఠ్యాంశాన్ని ఎప్పటికీ మరువొద్దని సూచించారు. చేతులను ఎలా శుభ్రంగా ఉంచుకోవాలో పాఠశాల ఉపాధ్యాయులు లలిత, రాధాకృష్ణమూర్తి విద్యార్థులకు వివరించారు.

మంచినీటి చెరువులను నింపుతాం

దాచేపల్లి : తంగెడ మేజర్ కాలువ ద్వారా మంచినీటి చెరువులను నింపుతామని జలవనరుల శాఖ ఏఈ నర్సయ్య తెలిపారు. మేజర్ కాలువలో పెరిగిన చెట్లను శుక్రవారం తొలగించారు. ఈ సందర్భంగా ఏఈ నర్సయ్య మాట్లాడుతూ మేజర్ కాలువ పరిధిలో వీరాపురం, ముత్యాలంపాడులో మంచినీటి చెరువులు ఉన్నాయని, ప్రస్తుతం కుడికాలువ ద్వారా వస్తున్న నీటిని తంగెడ మేజర్ కాలువకు మళ్లించి ఈ కాలువ నుంచి చెరువుల్లోకి నీటిని తరలిస్తామని చెప్పారు. మేజర్ కాలువలో ప్రవహించే నీటిని కేవలం తాగునీటి కోసం మాత్రమే ఉపయోగించాలని, పొలాలకు నీటిని మళ్లించవద్దని ఆయన కోరారు. చెరువులను నింపేందుకు రైతులు కూడా సహకరించాలని ఆయన చెప్పారు. ఈ పనులను సర్పంచ్ నెమలికొండ వెంకటచారి పరిశీలించారు.



కాలువలో చెట్లను తొలగిస్తున్న దృశ్యం

పత్తిలో అధిక దిగుబడులు సాధించాలి

దాచేపల్లి : పత్తిలో అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి డి.పాప కుమారి అన్నారు. దాచేపల్లికి చెందిన కంభంపాటి శివయ్య పత్తిపొలంలో రాయల్ సీడ్స్ వారి జయభేరి పత్తి విత్తన రకం ప్రదర్శన క్షేత్రాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రతి చెట్టుకు 100 నుంచి 120 కాయలు కలిగి ఉండి, ఎకరాకు 25 క్వింటాళ్ల చొప్పున పత్తి దిగుబడి అవుతుందని రైతులు చెప్పారు. రైతులతో కలిసి ఏవో పాపకుమారి పత్తి పంటను పరిశీలించి సూచనలు చేశారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను సాధించాలని, జయభేరి విత్తనం అధికశాతం నూగు కలిగి చీడపీడలను తట్టుకుంటుందని చెప్పారు. రాయల్‌సీడ్స్ డైరెక్టర్ శ్రావణ్, రీజనల్ మేనేజర్ నరసింహరావు, డిస్ట్రిబ్యూటర్స్ యోగానంద శ్రీనివాసరావు, సదా, లక్ష్మయ్య, కుమార్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏవో పాపకుమారి, ఇతర అధికారులు

ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం

పిడుగురాళ్ల: ప్లాస్టిక్‌ని నిషేధిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందామని పట్టణంలోని జీపీరెడ్డి గ్రూప్స్ కామినేని ఏసీ క్యాంపస్ విద్యార్థులు ర్యాలీ నిర్వహిస్తూ పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో మానవ వహారం చేపట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ చిన్నారులు ప్లాస్టిక్ పాలిథిన్ కవర్లతో వస్త్రాలు ధరించి అవగాహన కల్పించారని, ఇప్పటి నుంచి అయినా ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ నిషేధించి ముందుకు నడవాలని సూచించారు. ప్లాస్టిక్ నిషేధించి భూదేవిని కాపాడుకుంటేనే మానవాళి మనుగడ సాధ్యమవుతుందని ప్రతి ఒక్కరు గుర్తించాలని తెలియజేశారు. స్కాలర్స్ స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బ్రహ్మరెడ్డి, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆవుల జనార్దన్ తదితరులు ఉన్నారు.



మానవహారం నిర్వహిస్తున్న స్కాలర్స్ విద్యార్థులు

విద్యార్థినులకు బంగారు తల్లి హెల్త్ కార్డులు

వెల్దుర్తి: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులకు శుక్రవారం మండల ప్రత్యేకాధికారి జగదీశ్వరరెడ్డి బంగారు తల్లి ప్రోగ్రాం హెల్త్ కార్డులను అందించి మాట్లాడారు. రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని బంగారు తల్లి ప్రోగ్రాంను పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసి పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. మండలంలో ప్రభుత్వ పాఠశాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులకు రెండు నెలలకొకసారి రక్త పరీక్షలు చేసి హెల్త్ కార్డులలో నమోదు చేస్తున్నామన్నారు. రక్త హీనత ఉన్న వారికి పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. రక్తహీనత ఉన్న విద్యార్థినులకు ప్రత్యేకంగా మందులతో పాటు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ పరీక్షలను ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు బి.శ్రీరామ్ ఆధ్వర్యంలో వైద్యశాల సిబ్బంది నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్, తహసీల్దార్ కోటేశ్వరరావునాయక్, ఎంఈఓ కాంతారావు, ఎంఆర్‌పీ పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, తదితరులున్నారు.

క్యాంప్–2 పాఠశాలలో బంగారుతల్లి కార్యక్రమం

విజయపురిసౌత్: స్థానిక క్యాంప్–2 మండల పరిషత్ పాఠశాలలో శుక్రవారం బంగారు తల్లి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాచర్ల ఎంపీడీవో సరోజినిదేవి విద్యార్థినులకు, తల్లులకు రక్తహీనతను ఎదుర్కొనేందుకు ఆరోగ్యకర ఆహారమైన గుడ్లు, పాలు, ఐరన్ పుష్కలంగా ఉండే పదార్థాలను, ఫోలిక్‌యాసిడ్ టాబ్లెట్‌ను క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి హిమోగ్లోబిన్ పరీక్ష చేయించి హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచుకునేలా కృషి చేయాలని కోరారు. అనంతరం తల్లిదండ్రులచే పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించి బంగారుతల్లిగా ఎదగటానికి కృషి చేస్తానని ఎంపీడీవో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థినులకు హిమోగ్లోబిన్ ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాచర్ల డిప్యూటీ తహసీల్దార్ వాణి, ఎంఈవో అల్లి సురేష్, ఈవో కోటేశ్వరరావు, నాగులవరం సర్పంచ్ గోగిరెడ్డి వెంట్రావమ్మ వెంకటేశ్వరరెడ్డి, ఆర్ఐ ఫణికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, పాఠశాల హెచ్‌ఎం ఏ మల్లిఖార్జునరావు, ఎస్ఎంసీ చైర్మన్ బీర్నీడి రమేష్, ఉపాధ్యాయులు ఎస్‌కే మౌలాలి, జ్యోత్స్న, రాజకుమారి, వెన్నెల, అనూష పాల్గొన్నారు.

బాలికలు విద్యలో రాణించాలి

దాచేపల్లి : బాలికలు విద్యలో రాణించాలని ఎంపీపీ కటకం జయశ్రీ అన్నారు. మండలంలోని కేసానుపల్లి కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయంలో బంగారు తల్లి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. బాలికలకు వైద్య పరీక్షలు చేసి కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ జయశ్రీ మాట్లాడుతూ బాలికలు చదువుకునేందుకు అన్ని రకాల అవకాశాలను, సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాల్లో ఉండేలా చదవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీడీవో శోభారాణి, ఎంఈవో పినకాపాణి, సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నం, ప్రధానోపాధ్యాయుడు చెట్టిపాగు ఏసురత్నం, ఎస్‌వో సునీత, సీఆర్పీ అబ్రహాం, స్థానికులు నెల్లూరి కోటేశ్వరరావు, ఉల్లేరు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికా ఆరోగ్యమే జగనన్న లక్ష్యం

మాచర్ల: బాలికలు, మహిళలు, యువతులు ఆరోగ్యంగా ఉండి సమాజంలో ముందంజలో ఉండాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా అనేక కార్యక్రమాలను చేపడుతున్నారని మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, కమిషనర్ ఈవీ రమణబాబులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, నెహ్రూనగర్‌లోని వీరభద్రాపురం ఎంపీపీ స్కూల్‌లో బంగారు తల్లి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కోర్టు బజారులో, సచివాలయ పరిధిలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, పలువురు ఆరోగ్య కార్యకర్తలు, విద్యార్థినులకు రక్తహీనత గురించి తెలిపి హెచ్‌బీ టెస్టులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డు కౌన్సిలర్లు గట్ల కోటిరెడ్డి, ఎంఆర్‌ఎఫ్ రామాంజనేయరెడ్డి, నాగుల్‌మీరా, రామిశెట్టి వెంకటేశ్వర్లు, పురపాలక సంఘ సిబ్బంది, పాఠశాల హెచ్‌ఎంలు షేక్ షకీనా, గాదె కిరీటిరెడ్డి తదితరులున్నారు.

బాలికలలో హిమోగ్లోబిన్‌పై అవగాహన

పిడుగురాళ్ల: విద్యార్థినులలో హిమోగ్లోబిన్ శాతం పెరిగే విధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు తెలిపారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జగ్జీవన్ రావు హైస్కూల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థినులలో హిమోగ్లోబిన్ పెరిగేలా అవగాహన కల్పిస్తామని ఆయన తెలియజేశారు. కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి వారం ఒక స్కూల్‌ను పరిశీలించి అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించి బంగారు తల్లి కార్డులను పంపిణీ చేశారు. కౌన్సిలర్లు కత్తెరపు వాసుదేవరెడ్డి, మాదాల కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు ఆరోగ్యం ముఖ్యం

దుర్గి: బంగారు తల్లి ఆరోగ్యం కార్డులు ఆవిష్కరణ కార్యక్రమాన్ని శుక్రవారం దుర్గి జెడ్పీహెచ్ స్కూల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల స్పెషలాఫీసర్ కె.సంజీవరావు, తహసీల్దార్ జి.రమేష్ కుమార్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ చదువుతోపాటు ఆరోగ్యంపై ప్రతి విద్యార్థి శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థినుల ఆరోగ్య స్క్రీనింగ్ రిపోర్టులను ఆయా ఉపాధ్యాయులతో పాటు స్థానిక ఏఎన్‌ఎంలు పర్యవేక్షిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని బంగారు తల్లి ప్రోగ్రాంను కలెక్టర్ లోతేటి శివశంకర్ ప్రత్యేకంగా జిల్లాలో ఏర్పాటు చేసి పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి విద్యార్థులతో పాటు మండల అధికారులు భోజనం చేశారు. ఎస్ఎంసీ చైర్మన్ తోటకూర వెంకటేశ్వర్లు, ఎంఈఓ బెంజిమెన్, ఈఓపీఆర్‌డి జీఎల్ఎన్ గుప్తా, హెచ్‌ఎం కోటేశ్వరమ్మ, ఉపాధ్యాయులు తదితరులున్నారు.



విద్యార్థినులకు హిమోగ్లోబిన్ ప్రోగ్రెస్ కార్డును అందజేస్తున్న ఎంపీడీవో సరోజినిదేవి



ఆరోగ్య కార్డులను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, కమిషనర్ ఈవీ రమణబాబు



విద్యార్థులు ఆరోగ్య కార్డులు అందజేస్తున్న దృశ్యం



కార్డులను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, కమిషనర్ వెంకటేశ్వర్లు

రేపటి నుంచి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం



మాచర్ల: దసరా పండుగ పురస్కరించుకొని నవరాత్రులలో భాగంగా ఆదివారం నుంచి పట్టణంలోని అమ్మవారి దేవాలయాలలో వివిధ అవతారాలలో దర్శనమివ్వనున్నారు. ప్రతి ఏడాది నిర్వహించనున్న దసరా ఉత్సవాలలో భాగంగా శరన్నవరాత్రి ఉత్సవాలను పాత మాచర్లలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు, సొసైటీ కాలనీలోని శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి, కేసీపీ దారిలో, నగరేశ్వర స్వామి గుడిలో, రోప్‌వే కాలనీ, 13వ వార్డులోని కనక దుర్గ అమ్మవారు, చంద్రవంక బ్రిడ్జి ఆదిలక్ష్మి, వీరభద్ర స్వామి గుడిలో అష్టలక్ష్మి, 13వ వార్డులో సాయిబాబా గుడిలో లలితమ్మలను ప్రత్యేకంగా ఆయా అవతారాలలో అలంకరించనున్నారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు, శ్రీ మాతా అన్నపూర్ణేశ్వరి అమ్మవారి ఆలయాలలో అన్నదాన కార్యక్రమాలు జరుపనున్నారు.

యువకుడు ఆత్మహత్య

గురజాల : యువకుడు ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీలక్ష్మీసరస్వతి కోల్డ్ స్టోరేజీలో గత మూడురోజుల క్రితం కూలి పనుల కోసం వచ్చిన బాపట్ల జిల్లా ఎద్దనపూడి మండలం జాగర్లమూడి గ్రామానికి చెందిన చింతల కళ్యాణ్‌కుమార్ (31) గదిలో శుక్రవారం సాయంత్రం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోదరుడు చింతల శ్రీక్రాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై బి.అనంతకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ కలహాలే కారణమని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి 25 వరకు దసరా సెలవులు

పిడుగురాళ్ల: ఈ నెల 14 తేదీ నుంచి 25వ తేదీ వరకు దసరా సెలవులను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లింగాల ధనలక్ష్మి తెలియజేశారు. మరలా 26వ తేదీ పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయని ఆమె పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు 26వ తేదీ పాఠశాలకు హాజరు కావాలని ఆమె తెలియజేశారు.